


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఆ వేసవి రాత్రులు

**ఆ వేసవి కాలం** రాత్రులు మళ్ళీ తిరిగి రావు. సాయంకాలం కాగానే అందరిళ్ళముందూ చీపుళ్ళతో వూడ్చి, ఆకుపచ్చగా పేడ నీళ్ళు కల్లాపి జల్లేవారు. ముగ్గుల్లో పోటీ పడేవారు. శ్రీరామనవమి ముందు, పందిళ్ళలోంచి 'రామ కథను వినరయ్యా' అనో, 'శ్రీరాముని చరితమునూ వినురోరయ్యా ... ఘన శీలవతీ సీత కథా వినురోరయ్యో..' అనో రికార్డులు వినవచ్చేవి. మంచి మల్లెపూల కాలం పెరళ్ళన్నీ వెన్నెల కురిసినట్లు మల్లెల తోటీ, డాబాలన్నీ జాజీ చెంబేలీలతోటీ అలంకరించుకుని, ఘుమాయిస్తుండేవి.

నేనూ, సీతా, రాణీ, బుజ్జీ, వినీలియా, షాహీన్, ఎవరమైనా సరే మతాలూ, భాషలూ తారతమ్యాలు లేకుండా, పోటీలు పడి పూలమాలలు కట్టేవాళ్ళం. అవన్నీ పందిట్లో సీతమ్మ వారికి జడకుట్టి, పందిరి గుంజీలు పట్టుకుని, నాలుగు స్తంభాలాట ఆడాలని.

పార్వతమ్మ అత్తయ్య రొట్లో ఏది నూరినా లేహంలా నూరేది. చాటలకి కాయితాలూ, మెంతులూ పసుపువేసి రుబ్బి, పట్టిస్తే అవి బంగారు చాటల్లా మెరిసిపోయేవి. కంది పచ్చడి రుబ్బితే ఎత్తుకెత్తు ఎర్ర మిరపకాయలేసి, అదీ లేహమే. ఓసారి నేనూ సందానీ, వాళ్ళమ్మాయిని ఆటకి పిలవడానికి వెళ్ళాం. పార్వతత్తయ్య పచ్చడి రుబ్బుతోంది. నన్ను "ఉప్పు చాలిందా చూడవే" అని పిలిచి పిసరంత పచ్చడి పెట్టింది తిని "చాలు ఇది" అన్నాను.

సందానీగాడు వూర్కోకుండా తనూ చెయ్యి జాపాడు.

ఆవిడ "నీకొద్దులేరా?" అంది.

వాళ్ళ అమ్మాయి చిట్టి "ఎందుకొద్దూ, వాడికీ పెట్టు" అంది. పార్వతత్తయ్య పెట్టింది వాడు కుయ్యో" అన్న సౌండ్‌తో "నీళ్ళు.. నీళ్ళు.. నాకీ మంట.. నాకితే మంట.. నీళ్ళు" అని పరుగులు పెడ్తూ, ద్వారబంధాలు పట్టుకుని వెళ్ళాడాడు. నేను చెంబుతో నీళ్ళిచ్చేదాకా "అందుకే పెట్టనన్నానురా" అని అత్తయ్య పంచదార తెచ్చి వాడి నోటిలో పోసింది. ఆవిడ చేతికి

కారం ఎక్కువ పడ్తుందన్న మాటే కానీ, రుచికో రుచి. పులిహోర తిరగమోత పెడితే మూడు వీధుల దాకా ఘుమఘుమలొచ్చేవి. అటువంటి పార్వతమ్మ అత్తయ్య పులిహోర ప్రసాదం వున్న రోజున పందిరి కిటకిటలాడిపోయేది. హరికథ కన్నా ప్రసాదం భక్తులు ఎక్కువుండేవారు.

రాత్రిపూట వెన్నెల వీధులనిండా పరుచుకుని, ఇంటిముందు అరుగులు వెండిలా మిలమిలా మెరిసే వేళ, విధిగా కరెంట్ పోయేది. మా పిల్ల మూకంతా వీధిన బడి 'తై'య్యన ఆడేవాళ్ళం మా అమ్మమ్మ భాషలో.

"నేలనా? బండనా?" అనే ఆట ఫేమస్.

'నేల' అన్నారంటే, బండమీదకి రాకూడదు. బండ అన్నారంటే నేల మీదకి రాకూడదు. 'చెయిన్ ఆట' అంటే, ఎంత మందిని ముట్టించుకుంటే, అంతమందీ చెయిన్‌లా చేతులు పట్టుకుని పరిగెడ్తూనే వుండాలి. ఇంకోళ్ళని పట్టుకోవాలి. అలాగే 'కో' ఆటా.. ఇలా సాయంత్రం దీపాలు పెట్టగానే తిన్న అన్నం కాస్తా అరిగి పోయేది. అమ్మమ్మనో, బాబాయిల్నో మాయ చేసి తీసుకెళ్ళిన చిల్లర డబ్బులతో, పందిరి దగ్గర పెట్టిన మరమరాలుండలూ, కమ్మర కట్టీలూ, కొబ్బరి మీఠాయీ, సీమ చింతకాయలూ, పల్లీలూ ఒకటేవిటి ఏది దొరికితే అది కొని, కాకెంగిలి చేసుకుని ఒకరికి ఒకరం పంచుకుంటూ తినేవాళ్ళం. ఎగిరి ఎగిరి రొప్పుకుంటూ, పందిరికి దగ్గరగా వున్న ఎవరింట్లోనో చెంబెడు మంచినీళ్ళు అడిగి తాగేవాళ్ళం. అపరిమితవు. ఆటలూ అందుకు తగినట్లు ఆకలీ వేసేది. వేసవికాలం తాటి ముంజెలూ, తేగలూ, చెరుకు రసాలూ, మావిడి పండ్లూ, మల్లెపూలుతోబాటు ఆవకాయకూడా ఫేమస్,. భవాని "రేపు మా ఇంట్లో ఆవకాయ పెడ్తున్నారు" అనగానే, ఇంక వాళ్ళ ఇంటి చుట్టు పక్కలకి వెళ్ళేవాళ్ళం కాదు. మిరపకాయలు పెద్ద పెద్ద రోళ్ళల్లో కొట్టడం, ఆవాలు విసరడం, పెద్దాళ్ళంతా చేరి 'తుమ్ముకుంటూ' పాడుకుంటూ, ఆ కార్యక్రమంలో బిజీగా వుండేవారు. మాకు మాత్రం ఆవకాయ కలిపేసాకా ఆ బేసిన్‌లో అన్నం కలిపి, పెరుగు నంచి అన్నం ముద్దలు పెట్టేవారు ఆనక.

శ్రీరామనవమి పందిట్లో, మేం కునికి పాట్లు పడ్తుండగా, హరిదాసు గారు "శ్రీ మద్రమారమణ గోవిందో హరి" అని ఆరిపించి, నిద్ర మెలుకువ తెప్పించేవారు. హారతి పళ్ళెం.. ఆ తర్వాత ప్రసాదం పంపకం అవగానే, తినేసి, గుంజకి ఆనుకుని మళ్ళీ నిద్రపోయేవాళ్ళం.

హరికథ అయిపోయాకా, అమ్మలొచ్చి మమ్మల్ని లేపి ఎత్తుకెళ్ళడమో, లాక్కెళ్ళడమో చేసేవారు. ఇంటికెళ్ళాక, నిద్రంతా ఎటుపోయేదో కానీ, ఆరుబయట వేసిన మంచాల మీదో, అరుగుల మీదేసిన చాపలమీదో చేరి, గుసగుసలుగా కథలు చెప్పుకోడం మొదలెట్టేవాళ్ళం. ఎక్కువగా రాజకుమార్తెని ఎత్తుకుపోయి గుహలో దాచిన రాక్షసుడి కథలే. ఆ రాక్షసుడు ప్రాణాలు చిలకలో వుండడం. ఆ చిలక సప్తసముద్రాల అవతల వుండడం, అందరికీ రాక్షసుడి ప్రాణాలు తీసేదాకా ఎంత ఉద్వేగమో. రోజూ విన్నా తనివి తీరని పరమానందయ్య శిష్యుల కథలు మధ్య మధ్యలో పెద్దవాళ్ళు నిద్రాభంగం అయి "ఏవిట్రా ఆ నవ్వులు.. పడుకోండి" అని కసిరేవారు. ఎక్కడ లేని కబుర్లూ ఆ రాత్రి వేళే వచ్చేవి.

ఆ చిన్నతనపు చిరుతిండ్ల నుండీ, రాక్షసుడి కథలనుండీ పెరిగి పదో క్లాసులకీ ఆ పై క్లాసులకీ వచ్చేసాకా స్నేహితురాళ్ళతో చెప్పుకునే బోలెడు రహస్యాలు పెరిగేవి.

"ఆ శివగాడు మంచివాడు కాదే. నన్ను ఎంటపడి ఏడిపిస్తున్నాడు" అంటే,

"ఆ భాస్కర్‌గాడు ఉట్టి మజ్జిగన్నమే. అసలు నవ్వినా పట్టించుకోడు" అనే మాట్లాడే స్థాయికి ఎదగడం అన్నమాట.

సాయంత్రాలు తయారీ ఎక్కువ అవడం తలలో మల్లెపూలూ, ఓణీల్లో సోయగాలూ, పుస్తకాల షాప్ వంకతోటో, మణి ఆంటీ దగ్గర పాటలు నేర్చుకునే వంకతోటో సాయంకాలం రోడ్ల మీద తిరగడం , ఓరకంట ఎవరు ఏం కామెంట్ చేస్తున్నారో గమనించడం.. ఐస్‌ఫ్రూట్లూ, పీచు మిఠాయిలూ కాకుండా, మిరపకాయ బజ్జీలూ, మసాలా వడలూ కొనుక్కు తినడం, ప్రేమ నవలలు అద్దె పుస్తకాల షాప్‌లలో తీసుకుని ఒకరి నుండి ఒకరం పాస్ చేసుకుంటూ చదవడం సినిమాలూ, సినిమా పాటల పుస్తకాలు బట్టీ పట్టడం..కన్నెపిల్లల హంగామా అయితే ఇదంతా ఒకవైపు, ఇంకొక వైపు అభిమాన హీరోలు కలల్లోకి రావడం అయితే వయసు చేసే హంగామా అయితే.

వేసవి రాత్రులు డాబాల మీద కంబైండ్ స్టడీస్ పేరిట, వైరు లాగి బల్బు పెట్టి, చదువు పేరిట అమ్మాయిలం అంతా కలిసి చేసే కబుర్ల కవ్వాలీలూ, గానా బజానాలూ ఇంకో వైపు.

ఇంటి గేటుకి 'కన్నెపిల్లలున్నారు జాగ్రత్త' అన్న బోర్డులు పెట్టుకోవాలేమో అన్నట్లు ఇంటికి ఏ అన్నయ్య ఫ్రెండో వస్తే అంతా కలిసి అతనికి నిక్‌నేమ్స్ పెట్టడం తెగ నవ్వడం, కవ్వించడం, ఏడిపించడం ఇంత చేసాకా, వాళ్ళు ఊరుకుంటారా? ఒంటరిగా ఏ టైప్ ఇన్స్‌టిట్యూట్ నుండో వస్తుంటే, ప్రేమలేఖ ఇవ్వడమో జడపట్టి లాగడమో "సినిమా కొస్తావా?" అనడమో చేస్తే ఏడుస్తూ భయపడి పోయి పరుగున ఇంటికొచ్చి, ఏ అమ్మమ్మకో కంప్లయింట్ ఇవ్వడం ఇంక పెద్దవాళ్ళు రంగంలోకి దిగితే, మాకే పనిష్మెంట్. సాయంత్రాలు షికార్లు బంద్. సినిమాలు బంద్.

హూ! మన వయసే వున్న కజిన్ సిస్టర్‌తోటో, స్నేహితురాలి తోటో, రైల్లో మనని చూసి, వెంటపడి సైగలు చేసిన అబ్బాయి గురించో కాలేజీనుండొస్తుంటే ప్రేమలేక చేతిలో పెట్టి పారిపోయిన అబ్బాయి గురించో చెప్పుకోడం పక్కింటి డాబా మీద కొత్తగా వచ్చిన వాళ్ళ చుట్టాల కుర్రాడు మనని చూసి పాడాడు అనుకున్న 'జాబిలితో చెప్పనా, జామురాతిరి నువ్వు చేసిన అల్లరీ...రోజా' అనే పాట గురించో, పెద్దవాళ్ళకి తెలియకుండా, దుప్పటిలో దూరి రహస్యంగా చెప్పుకుంటూ పొందిన పారవశ్యాలూ, గిలిగింతలు పెట్టినట్లుండే నవ్వులూ.. పరాచికాలూ అన్నీ రాత్రిపూటే. పెద్దవాళ్ళు పడుకోండి.. పడుకోండి' అన్నా, ఆ ఈడు, కబుర్లకి కామానే కానీ ఫుల్‌స్టాప్ లేదనేది.

వెన్నెలకీ, వేసవికీ, ఓణీల వయసుకీ ఏదో అవినాభావ సంబంధం. కొబ్బరాకులమాటు చందమామలా, మధ్యమావతి పాడే మలయ మారుతంలా ఎంతో అందమైన రాత్రులు అవి.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4